# మహా జాతర

మన జాతర - మన మేడారం

నమస్తే తెలంగాణ

గురువారం 22 ఫిబ్రవరి 2024 వరంగల్ II




మేడారంలోని రెడ్డిగూడెం సమీపంలో బోరింగ్ వద్ద బకెట్లు వరుసగా పెట్టిన భక్తులు

# పానీ పాట్లు

- బకెట్లు, క్యాన్లతో భారీ క్యూ
- బోరింగుల వద్ద కొట్లాటలు



నీటి కోసం వాటర్‌ట్యాంకు వెంట పరుగెడుతూ..



ఏటూరునాగారం/వాజేడు/ములుగు రూరల్, ఫిబ్రవరి 21: మేడారం మహా జాతర ప్రారంభం రోజే భక్తులు నీటి కోసం తిప్పలు పడాల్సి వచ్చింది. చేతిపంపుల వద్ద భక్తులు కిక్కిరిసిపోయారు. ఈ క్రమంలో అక్కడక్కడ కొట్లాటలు జరిగాయి. ఛత్తీస్‌గఢ్, భద్రాచలం, కొత్తగూడెం, తదితర ప్రాంతాల నుంచి ప్రైవేట్ వాహనాల్లో వచ్చిన భక్తులు ఊరట్టం వైపు గుడారాలు వేసుకొని విడిది చేయగా, నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిలుకల గట్టు వైపు కూడా నీటి సరఫరా సక్రమంగా లేక చేతిపంపుల వద్ద కుస్తీ పడుతున్నారు. నీటి ట్యాంకర్ల వెంట పరుగులు తీస్తున్నారు. రెడ్డిగూడెంలో గద్దెలకు సమీపంలో బోరింగులు ఎక్కువగా లేవు. ఉన్న ఒక్క బోరింగు వద్ద బకెట్లను వరుసగా పెట్టి గంటల తరబడి వేచి ఉంటూ అవస్థలు పడ్డారు. తాగునీటి సౌకర్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసినట్లు చెబుతున్నా సరైన సరఫరా లేకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చినప్పటి నుంచి నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని, పిల్లలతో వచ్చాం ఎక్కడికి పోవాలంటూ ప్రశ్నిస్తున్నారు.



బావి దగ్గర నీళ్ల కోసం..



వంటకు నీళ్లు, కట్టెలు తెచ్చుకుంటూ..



కట్టెల మోపుతో..



జంపన్నవాగులో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ నుంచి నీళ్లు రాకపోవడంతో నిలిచిన స్నానాలు

# ట్యాప్స్.. స్టాప్ అండ్ రన్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 21: జంపన్నవాగులోని స్నానఘట్టాలపై ఉన్న బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ నుంచి నీళ్లు రావడం తరుచూ ఆగిపోతుండడంతో భక్తులు అయోమయానికి గురవుతున్నారు. భక్తులు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలు చేస్తూ ఒంటికి సబ్బు రాసుకుని ఉండగా ఒక్కసారిగా నీళ్లు నిలిచి ఇబ్బందులు పడుతున్నారు. నీళ్లు ఎందుకు ఆగిపోయాయో అర్థం కాకపోవడంతో నీళ్లు పోస్తున్న వైపు పరుగులు పెడుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయమో లేక ఇంకేదైనా సమస్యో తెలియడంలేదు. భక్తులు మాత్రం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కాగా, ఊరట్టం పొలిమేరల్లో ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ అలంకారప్రాయంగా మారాయి. పక్కనే తాత్కాలిక మరుగుదొడ్లకు నీటి సరఫరా లేక మల, మూత్ర విసర్జనలకు అవసరమైన నీటిని దూరం వెళ్లి తెచ్చుకుంటున్నారు.



ఊరట్టం సమీపంలో పనిచేయని బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్



ఎదురు కోళ్లను ఎగురవేస్తున్న భక్తులు



వంట చేస్తున్న మహిళలు



# మురుగు దారులు.. ముప్పు తిప్పలు

వాజేడు, ఫిబ్రవరి 21 : మేడారం జాతరలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. రోడ్లపై మురుగు నీరు పారుతోంది. దీంతో భక్తులు తిప్పలు పడుతున్నారు. రెడ్డిగూడెం నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే రహదారి పక్కన మురుగునీరు, చెత్తా చెదారం దర్శనమిస్తున్నాయి. మురుగునీటి పక్కనుండే భక్తులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. అధికారులు దృష్టిసారించి పరిసరాలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.



జాతరలో మురుగు నీరు, చెత్తతో నిండిపోయిన దారులు

# గోవిందరాజులు వేంచేశారహో..!

ఏటూరునాగారం, ఫిబ్రవరి 21 : మహాజాతరలో భాగంగా మేడారానికి కొండాయి నుంచి గోవిందరాజులు బుధవారం బయల్దేరి రాత్రి మేడారం గద్దెలపైకి చేరుకున్నారు. కొండాయిలోని గోవిందరాజుల గుడిలో పూజారి దబ్బగట్ల గోవర్దన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గుడిలో జలం చల్లి శుద్ధి చేశారు. కొండాయిలోని ప్రజలంతా మధ్యాహ్నం మూడు గంటలకు గుడికి చేరుకున్నారు. పక్కనే నాగులమ్మ ఆలయంలో పూజలు చేశారు. గోవిందరాజు పడిగతో గుడి నుంచి డోలు వాయిద్యాల నడుమ వడ్డె పొదెం బాబు జనసందోహం నడుమ బయల్దేరారు. తమకు ముక్తి ప్రసాదించాలని భక్తులు పడుకుని స్వాగతించారు. మహిళలు నీటిని ఆరబోశారు. కొండాయి నుంచి కొత్తూరు సమీపంలోని అటవీ మార్గాన ఊరట్టం మీదుగా మేడారానికి కాలినడకన గ్రామస్తులతో కలిసి బయల్దేరారు. మేడారంలోని సమ్మక్క గుడికి వెళ్లి అక్కడినుంచి గద్దెపై ప్రతిష్ఠింపజేశారు.



గోవిందరాజులను మేడారం తీసుకొస్తున్న పూజారులు, గ్రామస్తులు



మరుగుదొడ్ల వద్ద నీళ్లు లేక అవస్థలు

## జంపన్న తీరం.. జన సంద్రం



పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న జంపన్న వాగు